
కథ



# కథ మళ్ళీ మొదలైంది

జి. వెంకటకృష్ణ

పెళపెళరవంతో పిడుగు దూరంగా భూమిని ఢీకొంది. ఒక్కసారిగా వురుములతో మెరుపులతో తెలవారబోతున్న మసక వాతావరణం ఉలిక్కిపడింది. ఆ మెరుపుకు చిట్టడివిలా వున్న ఆ యింటి తోటలోని వేపచెట్టూ, రంగు వెలసిపోయిన గోడలూ, క్షణకాలం దేదీప్యమానమయ్యాయి. అంతగా ఎత్తు పెరగని వేపచెట్టు గుబురుగా ముదురు రంగులో వుంది. వేపచెట్టు కొమ్మల్లో గూడు వొకటి వుంది. మేఘావృతమైన ఆ ఉదయం కాస్తా జల్లు కురిసి ఆగింది. కురిసిన వర్షపు జల్లుతో, గూడు తడిసింది. గూడులోని తల్లీపిల్లా రెండూ తడిసిపోయాయి.

మరొక్కసారి పెళపెళలాడుతూ ఉరుమూ, జిగ్‌జిగేలుమంటూ మెరుపూ పరుచుకున్నాయి. గూడులోని పిచ్చుకపిల్ల ఆ వెలుగుకూ, ఆ శబ్దానికీ బెదిరిపోయి తల్లి రెక్కల్లోకి వొదిగింది.

‘ఈమాత్రం దానికే యింతగా బెదిరిపోతున్నావే. పెరిగి పెద్దగవుతూ యింకెంత భయాన్ని చూస్తావో, యేమో’ అనుకుంటూ తల్లి దాన్ని మరింత దగ్గరగా అదుముకుంది గానీ, తడివల్ల వెచ్చదనాన్ని ఇవ్వలేకపోయింది. తల్లి పిచ్చుక

గూడు బయటికొచ్చి తడిసిన వొంటిని ఆరబెట్టుకునేందుకని ఒక్కసారిగా గాల్లోకి ఎగిరి, వొంటిమీద ఈకలన్నింటినీ ఒక్కసారి కుదుపుతో కదిలించి, రెక్కలను టపటపలాడించింది. అలా నాలుగైదుసార్లు చేసింది. ఎగిరిన ప్రతిసారీ, చిన్నచిన్న నీటి రేణువులు చుట్టూ గాల్లోకి పరుచుకుంటూ, సూక్ష్మవర్షం కురిసింది.

పిచ్చుకపిల్ల కిచకిచమని పిలుస్తుంటే తల్లి గూడువద్దకు ఎగిరింది. పిల్ల పిచ్చుక తల్లిని చూసి సరాగాలుపోతూ దాని వీపుమీదకు ఎక్కి మెడకు మెడను ఆనించి, అమ్మను ముక్కుతో తియ్యగా, సుతారంగా గుచ్చింది. పిల్ల పిచ్చుకను చూస్తుంటే తల్లికి ఎంతో ముచ్చటేసింది. తుషారస్ఫటికాలతో, తడిసిన గచ్చగాయ రంగు వొంటితో, నుదుటి మీద ముదురు రంగు నక్షత్రాకార మచ్చతో, గొంతు కింద నుంచి పొట్టదాకా హిమరాశి పేరుకున్నట్టు, తెల్లగా ఎంతందంగా వుంది తన బిడ్డ! అచ్చం తన పెనిమిటి పోలికే. మైమరపుతో తల్లి పిచ్చుక రెక్కలు టపటపలాడిస్తూ, ముక్కుతో బిడ్డకు మేథో సంజ్ఞ చేసింది. ఏమర్థం చేసుకుందో ఏమోగానీ, పిచ్చుకపిల్ల కూడా తల్లిలానే రెక్కలనాడించింది. అది రెక్కలనాడించినప్పుడంతా దాన్ని తడిపిన వాన చెమ్మ తల్లిచుట్టూ పరుచుకుంటూ వుంది. తల్లి బిడ్డచుట్టూ కేరింతలు కొడుతూ, గూడు మీద కిచకిచమని ఎగురుతూ చిన్నదాన్ని ఉత్సాహపరుస్తూ ఉంది.

మెల్లగా తొలిభానుడి రేకలు విచ్చుకుంటున్నాయి. తడిసిన ప్రకృతి వెచ్చబడుతూ వుంది. ఉదయభానుడి బంగారు వర్ణపు కిరణం పిల్లపిచ్చుక గచ్చకాయ వర్ణపు వొంటిని తాకి గిలిగింతలు పెడుతోంది.

వేపచెట్టు ఆకుల మీద కాంతి ప్రతిఫలించి కొంత సంభ్రమాన్ని వ్యాపింపజేస్తోంది. మెల్లగా చెట్టు కొమ్మల మీద పరుచుకున్న వెలుగులో జీవసంచారం ప్రారంభమైంది. చీమలూ, నానారకాల పురుగులూ, పక్షులూ కదలబారుతున్నాయి. తల్లి పిచ్చుక, బిడ్డతో మురిపాలు సాగిస్తూనే పురుగుల్ని ఒక కంట గమనిస్తూ ఉంది. పైకొమ్మ మీద తిరుగాడుతున్న పురుగుల్ని నాలుగింటిని వొడిసిపట్టుకొని తెచ్చి బిడ్డముందేసింది. పిల్లపిచ్చుక గిలగిలలాడుతున్న పురుగుల్ని వింతగా చూస్తూ, తప్పించుకోవడానికి పాకిపోతున్న ఒక్కో పురుగునూ పొడిచి పొడిచి వాటి ప్రాణాలతో ఆడుకుంటూ ఆరగించింది. బిడ్డను గమనిస్తున్న తల్లి పిచ్చుక, బిడ్డ ఆటను చూసి నిర్వేదంగా నవ్వుకుంది.

ఇంతలో యింటి ఆడమనిషి చేటలో బియ్యంతో బయటికి వచ్చి చెరగడం మొదలెట్టింది. చెరిగే క్రమంలో రాలిపడే మెరికలనూ, మట్టిపెళ్ళలనూ, నూకనూ ఏరి పిల్లలకు పెట్టడం, తనూ తినడం రోజూ దానికి అలవాటే. బియ్యపు నూకను తింటూ పిల్ల పిచ్చుక కేరింతలు కొట్టింది. అంతలో చెట్టుకొన కొమ్మల్లో ఆకు చివర్ల వేలాడుతున్న చినుకొకటి సూర్య కిరణాలకు వజ్రంలా వెలిగిపోతూ, గాలికి రాలి, పిల్ల పిచ్చుక నెత్తిమీద టప్పుని పడింది. అంతే! పిల్లపిచ్చుక హడలిపోయి, చిన్ని రెక్కల్ని టకటకలాడిస్తూ, గూడు అంచుల మీదికి వురికింది. అది చూస్తూ తల్లి పిచ్చుక పిచ్చిగా నవ్వుకుంది. అప్పటికి సూర్యుడు నల్లని మేఘం పక్కన సర్వాంగ సుందరంగా ప్రకాశిస్తున్నాడు.

ఆ యింటిచుట్టూ పెద్ద ఖాళీ స్థలముంది. ఆ ఖాళీ స్థలం చుట్టూ కాంపౌండ్ వాల్ వుంది. కాంపౌండ్ వాల్ గేటునుంచీ, యింటి వాకిలి దాకా నడవడానికి వీలుగా నాలుగడుగుల వెడల్పుతో నల్లబండల పరుపు వుంది. ఆ వొక్కదారి తప్ప, యింటిచుట్టూ తివాచీ పరిచినట్టు పచ్చటి గడ్డి, ఎన్నోరకాల చెట్లూ, పూలకుండీలూ, వెరసి తోట మధ్యలో ఇల్లు కాస్తా చిట్టడవి మధ్యలో ఇల్లు లాగా వుంది. పిచ్చుకలు వున్న వేపచెట్టు కాంపౌండ్ వాల్‌కు దగ్గరగానే వుంది.

తల్లి పిచ్చుక ఉదయపు చిరపరిచితమైన శబ్దాలు వింటూ, చుట్టూ చూస్తున్నది. ఇంటిలో కుక్కర్ చేసే శబ్దాలూ, కాంపౌండ్ గేటు వద్ద పాలవాడి సైకిల్ శబ్దం, పేపర్ పిల్లవాడు పేపర్ విసిరిన విసురూ, యింటిలోని మగ గొంతు అరిచే అరుపులూ అన్నీ యథాలాపంగా వింటూ, కొమ్మల మీద ఎగురుతూ, బిడ్డకు పురుగులు పట్టియ్యడమో, తనలాగా ఎగరమని సంకేతించడమో చేస్తూ వున్నది.

అన్ని యథాలాప శబ్దాల మధ్యా పిచ్చుకకు ఎప్పుడూ తనను వెంటాడే ఢాంమ్మనే శబ్దం వినిపించింది. దూరంగా దేన్నో పెద్ద భవనాన్ని కూలగొడుతున్న శబ్దమే అది. ఆ శబ్దం ఇక్కడిదాకా రాదుకదా అని తల్లి పిచ్చుక భయపడసాగింది. మూడు నెలల క్రితం యీ పిచ్చుక తన జంటపిచ్చుకతో కలిసి ఒక పాత యింటి గోడ వెంటిలేటర్‌లో కాపురముండేది. పెనిమిటితో సరాగాలుపోతూ, కువకువలాడుతూ అనురాగాలు పంచుకునేది.

ఉన్నదున్నట్లుగా ఒక ఉదయం ఆ యింటిని కూల్చేశారు. పిచ్చుకల కలల గూడు చెదిరిపోయింది. కూల్చే క్రమంలో గోడతోపాటు నేలకూలిన మగపక్షికి గాయాలు తగిలాయి. రెండూ ఎంతో అవస్థలు పడుతూ అక్కడనుంచీ బయటపడి యిక్కడికైతే వచ్చాయిగానీ, ఆ గాయం నొప్పితో మగపిచ్చుక కొద్ది రోజులకే చనిపోయింది. పెనిమిటిని కోల్పోయిన పెంటి పిచ్చుక ఎంతో తల్లడిల్లిపోయింది. దివారాత్రాలు శోకంలో మునిగిపోయింది. తిండితిప్పలు మానేసింది. అయితే తాను, తన ప్రియుడి ప్రేమ కారణంగా తల్లిని కాబోతున్నానని తెలిసి సంతోష విషాదాలలో కుమిలిపోయింది. తర్వాత తన ప్రియుడి జ్ఞాపకాలతో గుడ్లను పొదిగింది. చివరికీ పిల్ల పిచ్చుకను దక్కించుకుంది.

బాధాకర జ్ఞాపకాల వలపోతలో కూడా పిచ్చుక చెవులు రిక్కించీ, ముక్కును నిముషానికి మూడుసార్లు తిప్పుతూ, తనచుట్టూ జరిగే కదలికలనూ, శబ్దాలనూ గమనిస్తూనే వుంది. రెండుమూడు సీతాకోక చిలుకలు పచ్చిక మీద నుంచి ఎగురుతూ తన కొమ్మ మీదికే వచ్చి తన గూడు ముందు విన్యాసాలు చేసి వెళ్ళాయి. వాటిని చూసి పిల్లది కేరింతలు కొడుతూ రెక్కలను ఆడించింది. సీతాకోకల విన్యాసాలు పిల్లపిచ్చుక రెక్కల్లోకి ఏదో కొత్త శక్తినే ఇచ్చింది. అందుకే అది కూడా రెక్కలనాడిస్తూ కొంత ఎత్తువరకూ ఎగిరి పక్క కొమ్మమీద వాలి, పడిపోబోయి, తోక సాయంతో నిలువరించుకొని కుదురుగా కూర్చుంది.

దృశ్యాన్ని చూస్తున్న తల్లిపక్షి గుండెల్లో ఒక్కసారిగా వేడిరక్తం ప్రవహించింది. వొళ్ళు ఝల్లుమనిపించింది. కొన్ని క్షణాలు కలలా అనిపించింది. తను చూసింది నిజమేనా! తన పిల్ల ఎగరగలిగిందే! అని సంబరపడిపోయింది. పక్క కొమ్మమీద వాలింది. మరి గూడు మీదికి ఎట్లా వస్తుందోనని ఆందోళన చెందింది. తల్లి మనోవ్యాకులతను చెరిపేస్తూ పిల్లపిచ్చుక మెల్లగా రెక్కలను టపటపలాడిస్తూ ఎగిరొచ్చి గూడు మీదకు చేరింది. తల్లిపక్షి హాయిగా గాలిని పీల్చుకుంది. తన బిడ్డకు ఎగరడం వచ్చిందని తల్లిపక్షి కేరింతలు కొడుతూ పిల్లపక్షికి ముక్కుతో ముద్దులు పెట్టింది.

మరికాసేపటికి రెండు కందిరీగలు ఝూంకారనాదంతో గూడు మీద ఎగిరి పిల్లపక్షిని ఆనందపరిచాయి. ఆకుల గలగలల మర్మర ధ్వనులు దాన్ని విస్మయపరిచాయి. అయితే పిల్లపక్షి యీ గలగలల గాలి చేసే సవ్వడుల మధ్యా యేదో బరబరా పాకుతున్న శబ్దాన్ని వింటోంది. అదేదో కన్పించడం లేదుగానీ ప్రతిసారీ బరబరా మంటోంది. యేదో గత్తర వాసన వస్తోంది. ఎన్నో ధ్వనులూ, దృశ్యాల మధ్య తల్లిపి


ఆకాశంలో గ్రహాలు ఎన్ని ఉన్నా...
వెలుగునిచ్చేది సూర్యుడొక్కడే...
లోకంలో మ్యారేజ్ బ్యూరోలు ఎన్ని ఉన్నా...
పెళ్ళి కుదిర్చేది 'కాకతీయ' ఒక్కటే

ఆకుపచ్చని తోరణం... పసుపు పచ్చని గడప... 'కాకతీయ' తెచ్చిన పెళ్ళి మండపం... 3 దశాబ్దాలుగా... 4 రాష్ట్రాల్లో.... 30 నగరాలలో.... చక్కని పెళ్లికి.... చిరకాల అనుబంధానికి... కాకతీయ మ్యారేజెస్ ప్రైవేట్ లిమిటెడ్. నేడే మీ సమీప బ్రాంచ్‌ను సందర్శించండి.
మీ కలల భాగస్వామిని కలుసుకోండి.


శ్రీమతి & శ్రీ చిరంజీవి యలమంచి

కాకతీయ మ్యారేజెస్ ప్రై. లిమిటెడ్
103, 109 & 203, విజయశ్రీ అపార్ట్‌మెంట్స్, చర్మాస్ వెనుక,
అమీర్‌పేట్, హైదరాబాద్ - 500 073.
ఫోన్ : 040-2374 7777, 09396 999 999

FREE online registration & Free search

AN ISO 9001:2000 ORGANISATION
www.kaakateeya.com www.telugumarriages.com www.kannadamarriages.com www.tamilmarriages.com

www.kaakateeya.com

| | | | |
|---|---|---|---|
| అమీర్‌పేట్ | 098481 55222 | చెన్నై (అన్నానగర్) | 093839 99999 |
| కూకట్‌పల్లి | 093913 11444 | టి. నగర్ | 093400 99993 |
| ఆర్‌టిసి క్రాస్ రోడ్స్ | 099855 47475 | తాంబరం | 093400 99993 |
| దిల్‌సుఖ్‌నగర్ | 098485 66733 | బెంగుళూరు | 093429 39345 |
| విజయవాడ | 093922 92939 | జయానగర్ | 093429 39343 |
| గుంటూరు | 098485 35375 | మైసూరు | 093429 39342 |
| తెనాలి | 098480 31931 | కోయంబత్తూరు | 093457 94668 |
| విశాఖపట్నం | 098481 63833 | సేలం | 093855 99066 |
| రాజమండ్రి | 098485 35377 | మధురై | 093603 35233 |
| కాకినాడ | 098483 37378 | వెల్లూర్ | 093449 94400 |
| ఖమ్మం | 093470 59988 | తిరుచి | 098428 01111 |
| ఒంగోలు | 098487 11223 | పాండిచ్చేరి | 098421 27777 |
| నెల్లూరు | 098481 97222 | ఈరోడ్ | 093855 99011 |
| తిరుపతి | 098485 35378 | అనంతపూర్ | 093460 09348 |
| కర్నూల్ | 093900 33815 | | |

చ్చుక యీ గత్తరను గమనిస్తూ వుంది. ఏదో ప్రమాదం పొంచివున్నట్లు దానికి సంకేతం అందుతోంది. చుట్టూ చల్లని వాతావరణం, ఆహ్లాదకరమైన పిల్లపిచ్చుక విన్యాసాలూ వున్నా తల్లి ప్రశాంతంగా వుండలేకపోయింది. కనిపించని శత్రువును ఆలోచిస్తూ పిచ్చుక గూడు చుట్టూ చక్కర్లు కొట్టసాగింది. దూరంగా వెళ్ళి చూడదలచి, రెండు కొమ్మల కిందికి వెళ్ళింది. అక్కడ గన్నేరు చెట్టుకొమ్మలు తాకుతున్నాయి. అక్కడినుంచీ గూడువైపు చూసింది, అంతే...?!

గూడు అంచుల మీద కేరింతలు కొడుతున్న పిల్లపిచ్చుక ఎదురుగా, ఎర్రని నోరు తెరచి, అంతే ఎర్రని నాలుక బయటపెట్టి, పెద్ద తొండ వొకటి నిలుచుని వుంది. గూడు కింద నుంచీ పాకుతోంది. గుండ్రంగా ముందుకొచ్చిన కళ్ళూ, వీపుమీద పొడుచుకొచ్చిన ముళ్ళూ, రంగురంగులుగా మెరిసిపోతున్న వొంటితో 'యేందబ్బా యీ ప్రాణి యింతందంగా వుంది' అనుకుంటూ పిల్లపిచ్చుక గొంతు చాచి దానికెదురుగా వెళ్తోంది. ఇంత సునాయాసంగా, ఏ బలప్రయోగమూ లేకుండా, తన నోటికందుతున్న ఆహారాన్ని చూస్తూ అంతవరకూ క్షుద్బాధతో కలిగిన అలసటను మరచి, తొండ అర మోడ్పు కనులతో, పిల్లపిచ్చుకను అందుకోబోతోంది.

''ఆ తర్వాత ఏమైంది, పిల్లపిచ్చుక తొండ నోటికి దొరికిపోయిందా?'' ఉత్కంఠను ఆపుకోలేక, కథ వింటున్న పాప తన తండ్రిని అడిగింది. కథను కొన్ని క్షణాలు ఆపిన తండ్రి, తిరిగి కొనసాగించాడు.

పాకుతున్న తొండను చూసిన తల్లి పక్షి వొక్క ఉదుటున ఎగిరి తొండ తలను ముక్కుతో పొడిచింది. కిచకిచమని భీకరంగా అరవడం మొదలుపెట్టింది. తల్లి ఆర్తనాదాలకు వొళ్ళు తెలిసిన పిల్లపక్షి గూడు అంచుమీదికి వురికింది. తన నోటికి అడ్డుపడుతున్న తల్లి పిచ్చుకనే పట్టుకునేందుకు తొండ వొడుపుగా మొర సాచి దాడిచేసింది.

తల్లి పిచ్చుక టపటపమని రెక్కలనాడిస్తూ, కిచకిచమని గగ్గోలు పెడుతూ, అంత ఎత్తు ఎగిరి రివ్వున తొండమీదికి వురుకుతోంది. తల్లి గాల్లోకి ఎగరగానే, తొండ, పిల్లకోసం గూడులోకి దూకింది. గూడు అంచుల్లో వున్న పిల్లపిచ్చుకను అందుకునేంతలో తల్లి పిచ్చుక తొండ ముందర గగ్గోలుపెడుతూ మళ్ళీ అడ్డుకుంది. ఈసారి తొండ, లాఘవంగా తల్లిపిచ్చుక రెక్కను పట్టుకుంది గానీ, అంతలో తల్లిపిచ్చుక ముక్కుతో తొండ వీపును పొడిచి తప్పించుకుంది. భీకరంగా అరుస్తూ, తొండ మోరసాచి గూడును కొట్టింది. ఆ కుదుపునకు అంచుల్లో వున్న పిల్లపిచ్చుక పట్టుతప్పి గాలిలో వూయల లూగుతూ, రెక్కలనాడిస్తూ వుంది. తొండ ఆఖరియత్నంగా పిల్లను అందుకుందామని గూడు అంచుమీదికి బలంగా వొంగింది. ఆ వూపుకు పిల్లపిచ్చుక కిందికి జారిపోయింది. దాన్ని చూసి తల్లి ఆర్తనాదం చేసింది. తన బిడ్డ లేతవొళ్ళు నేలను ఢీకొని యేమైపోతుందోనని ఆందోళన చెందింది.

అందకుండా పోయిన పిచ్చుకను చూసి తొండ నిరాశపడింది. ఆకలితో అలమటిస్తున్న దాని కడుపులో పేగులు వుండచుట్టుకుపోతున్నాయి. నిస్సారంతోనూ, అంతవరకూ చేసిన ప్రయత్నంతోనూ అది అలసిపోయింది. అయినా ఆశ చావక కొమ్మమీద నుంచి కిందికి చూసింది. ఇంకా ప్రయత్నం చేయవచ్చని దానికర్థమైపోయి మళ్ళీ బయలుదేరింది.

జారిన పిల్లపిచ్చుక పచ్చిక మీద పడి వొరిగిపోయింది. తల్లి రివ్వున దాని పక్కన వాలి బిడ్డను అనునయిస్తోంది.

'లే, పైకిలే. రెక్కలనాడించు. ఎగురు. ఎగరకుంటే అది వచ్చేస్తుంది. బిడ్డా, లేమ్మా' అంటూ శోకంతో అరుస్తోంది. ఆ క్షణంలో తల్లిపిచ్చుకలో ఎన్నో చెప్పలేని భావాలు కదలబారినాయి.

'ఏమిటీ జీవితం. ఏమిటీ వైపరీత్యం. తన బతుకు ఎందుకిట్లా అయింది. ఏ చెట్టుకొమ్మల్లోనో పుట్టాను. ఎన్నో ఉపద్రవాల్ని తప్పించుకున్నా భర్తను మాత్రం పోగొట్టుకున్నాను. ఆ తర్వాత ఎంతో దుఃఖాన్ని భరించి, గుడ్లను పొదగడానికి ఎంతో భయాన్ని భరించి, ఎంతో హింస ననుభవించి, బిడ్డను చూస్తూ అన్నిటినీ మరిచిపోదామనుకుంటే మళ్ళీ ఇదేమిటి. ఈ కష్టాన్ని ఎలా దాటాలి. పిల్ల ఇప్పుడు పైకి లేస్తుందా. ఎగరగలిగితే ఎంత బాగుండు. రెక్కలున్నది ఎందుకు. పొద్దున పక్క కొమ్మమీదికి ఎగిరింది కదా. అయినా ఈ పసికూన లేత రెక్కల్లో యిప్పుడు అంత బలం లేదేమో, అయితే తన బిడ్డ గతి యింతేనా' అని వలపోస్తూ వుంది.

తల్లి చేసే శబ్దాలూ, ఆందోళనా స్వరమూ పిల్లపిచ్చుకలో చిన్న కదలిక కలిగించింది. అది తొండను చూసీ, తొండలో తల్లి చేసిన యుద్ధాన్నీ చూసి భయపడిపోయింది. తల్లికి ఏమవుతుందో, మీదికొస్తున్న రాక్షసి అదేమిటో అనే భయంతో గుండెలు కొట్టుకుంటుంటే, గూడు అంచుల్లో నిల్చున్నది కాస్తా అయోమయంలో జారిపడిపోయింది. ఇప్పుడు తల్లి స్వరం వినిపిస్తోంది అంటే అమ్మ తన దగ్గరుంది. అమ్మకేం కాలేదు. యిక భయం లేదు అనుకుంటూ కళ్ళు తెరిచింది. రెక్కలు కదిలించింది.

అంతలో తొండ కొమ్మల మీదనుంచీ చరచరా పచ్చిక మీదికి శక్తినంతా కూడదీసుకుని వచ్చేసింది. దాని కడుపు నకనకలాడుతోంది. బడలికగా వుంది. సృష్టి చేస్తున్న విచిత్రానికది ఆశ్చర్యపోతూ వుంది. 'కొమ్మ మీదనే సునాయాసంగా నోటికందాల్సిన ఆహారం నేలమీద పడుంది. నేల తన ఆటస్థలం. నేల మీద తను ఎన్ని మాయలైనా చేయగలదు. ఆ తల్లి ఆటలు యిక సాగనివ్వదు' అనుకుంటూ తొండ పచ్చిక మీద తన మాయాజాలాన్ని ప్రయోగించి పచ్చగా మారిపోయి లాఘవంగా పాకడం ప్రారంభించింది.

తల్లిపిచ్చుక గగ్గోలు పెడుతూ దానిమీద ఎగరసాగింది. తొండ మోరసాచి తల్లి పిచ్చుకను అందుకోవాలనీ చూసింది. కిచకిచమంటూ తల్లి తప్పించుకుంటూ బిడ్డను పైకి లెమ్మని హెచ్చరిస్తూనే వుంది. తొండ ఆకలితో, కసితో, ఒక్క ఉదుటున పిల్ల మీదికి దూకింది – బలవంతుడు బలహీనుడి మీదికి దూకినట్టు.

***

''ఆ తర్వాత ఏమైంది, పిల్లపిచ్చుక తొండ నోటికి దొరికిపోయిందా?'' ఉత్కంఠను ఆపుకోలేక, కథ వింటున్న పాప తన తండ్రిని అడిగింది. కథను కొన్ని క్షణాలు ఆపిన తండ్రి, తిరిగి కొనసాగించాడు.

''పిల్లపిచ్చుక రెక్కల్ని కూడదీసుకొని టపటపలాడించింది. రెక్కల్లోకి ఉదయం సీతాకోక చిలుకల్ని చూసిన సంబరం పాకింది. తల్లి చేస్తున్న పోరాటం వేడి రక్తమై పొంగింది. తల్లి ప్రేమా, తల్లి రెక్కల వెచ్చదనం గుండెల్లోకి విశ్వాసమై వ్యాపించింది. అంతే! తొండ తనమీద పడే క్షణానికి ముందే, రెక్కలనాడిస్తూ పచ్చికపైన వేలాడుతున్న గన్నేరు కొమ్మ మీదికి ఎగిరింది. గన్నేరు కొమ్మలపైనే వేపచెట్టు కొమ్మలూ పరుచుకొని ఉన్నాయి. ఇక ఒక్క ఎగురు ఎగిరితే చాలు వేపకొమ్మల్ని అందుకోగలదు. అంతే!''

''అంతే, అంటే కథ అయిపోయిందా?''

''అంతేగదా పూర్తయింది.''

''లేదు...''

''ఎందుకు లేదు?''

''తొండ గన్నేరు కొమ్మ మీదికి పోవచ్చు గదా''

''పిల్లపిచ్చుక బరువుకే గన్నేరు కొమ్మ వొంగి వూగిసలాడుతోంది. ఇంక తొండ బరువును తట్టుకుంటుందా! తట్టుకోలేదు. అంతలో యింటాయన బయటికొచ్చాడు అనుకో, ఆ అలికిడికి తొండ పారిపోక తప్పదుగదా!''

''అట్లయితే మళ్ళీ ఎప్పుడైనా ఈ తొండ, తల్లీపిల్ల మీదికి పోవచ్చు కదా?''

''అవును. మళ్ళీ ఉదయమో, తర్వాతి దినమో లేదా మళ్ళీ వారమో, మళ్ళీ సంవత్సరం తర్వాత యిలాంటి ఉదయమో యిదే కథ జరుగుతుంది.''

''అవునా! యిదే కథ జరుగుతుందా? తల్లిపిచ్చుక బిడ్డకోసం కొట్లాడుతుందా? పిల్లపిచ్చుక తప్పించుకుంటుందా?''

''అవునూ, కాదూ.''

''రెండూ, ఎలా సాధ్యం?''

''అవును. రెండూ సంభవమే. ఈసారి తల్లి, తొండ ఆకలికి చిక్కి బిడ్డ తప్పించుకొని పెరిగి పెద్దదై, తిరిగి తన బిడ్డకోసం యిలాంటి తొండతో యుద్ధం చేయాల్సి రావచ్చు. లేదా పిల్లనే తొండకు చిక్కి తల్లి మిగిలిపోవచ్చు. ఈ అనంత కథనం, నిరంతరంగా భూమ్మీద జరుగుతూనే వుంది.

''అవునా! ఏదీ మళ్ళీ చెప్పు ఆ కథ...''

పెళపెళ రవంతో దూరంగా పిడుగు పడింది. ఉరుములతో మెరుపులతో ఆ మసక ఉదయం వులిక్కిపడింది. ఆ వెలుగుకూ ఆ శబ్దాలకూ బెదిరి పిల్లపిచ్చుక తల్లిరెక్కల కింద వొదిగింది. కాసేపు జల్లు కురిసి నెమ్మదించిన ఆ ఉదయం ఆ యింటి కాంపౌండ్‌లోని వేపచెట్టు కొమ్మల మీది పిచ్చుకల గూడు మీద తొలి భానుడి బంగారు వర్ణకిరణం పడి పిల్లపిచ్చుకను గిలిగింతలు పెట్టింది. గచ్చకాయ రంగులో, నుదుట బూడిద వర్ణపు నక్షత్రపు మచ్చతో, గొంతుకింద నుంచి పొట్ట దాకా హిమరాశి పేరుకున్నట్టు తెల్లగా ఎంతో అందంగా ఉన్న బిడ్డలో తల్లిపక్షి ఏవో పురా జ్ఞాపకాలను నెమరువేసుకుంటోంది. ఉదయపు సవ్వడుల మధ్య తల్లిపక్షి ఏదో బరాబరా శబ్దాన్ని పసిగడుతోంది. ఇంకాసేపటిలో జరగబోయే జీవన పోరాటాన్ని చూడడానికేమో సూర్యుడు ఆ వేపచెట్టు మీద ప్రకాశవంతమవుతున్నాడు.

★